

ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న కాశీబుగ్గ దసర ఉత్సవ సమితి సభ్యులు

## ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కాశీబుగ్గ, అక్టోబర్ 12 : గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ పద్మానగర్ చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహించే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు కల్పించి సహకరించాలని కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని బతుకమ్మ, దసరా ఉత్సవాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, బయ్యా స్వామి, సమితి కన్వీనర్ దూపం సంపత్, కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి గుల్లపెల్లి రాజ్‌కుమార్, ఆర్టీఏ సభ్యులు మనోహర్, గుత్తికొండ నవీన్, ఓంప్రకాశ్ కోలారియా, పీ మార్టిన్‌లూథర్, వీ నాగరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్, ఆంజనేయులు, సురేశ్, దుబ్బ శ్రీనివాస్, సతీశ్, గోపి, రామయాదగిరి, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

### తాళ్ల పద్మావతిలో ముగిసిన క్లినికల్ ఫార్మసీ సదస్సు

కరీమాబాద్, అక్టోబర్12 : నగరంలోని ఉర్సు బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్లినికల్ ఫార్మసీ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా అవేనిడా ఇన్నోవేషన్స్ చైర్మన్ డాక్టర్ అశ్వినిధర్ అమెరికా నుంచి వెబినార్ ద్వారా క్లినికల్ ఫార్మసీ ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్‌లో ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఫార్మసీ రంగంలో వచ్చిన ఆధునిక విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ రకం, డాక్టర్ భగీరథ్, మెడికేర్ హాస్పటల్ డైరెక్టర్ చిన్నప్ప రెడ్డి, తాళ్ల పద్మావతి కళాశాల డైరెక్టర్ తాళ్ల వరుణ్, డాక్టర్ ప్రణయ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ బేతి శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### టీచర్స్ కాలనీలో బొడ్డెమ్మ పండుగ వేడుకలు



టీచర్స్ కాలనీలో బొడ్డెమ్మ ఆట ఆడుతున్న మహిళలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 12 : వరంగల్ దేశాయిపేట రోడ్డులోని గణేశ్‌నగర్ టీచర్స్ కాలనీలో గురువారం రాత్రి బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14న జరుగు ఎంగిలి పూల బతుకమ్మ పండుగకు రెండు రోజుల ముందు స్థానిక కాలనీ మహిళలు బొడ్డెమ్మను తయారు చేసుకుని వచ్చి ఆడి పాడారు. బంగారు బతుకమ్మను కొలుచుకోవడంతో భాగంగా రెండు రోజుల పటు బొడ్డెమ్మ ఆటను భక్తి శ్రద్ధలతో ఆడుతామని స్థానిక మహిళలు తెలిపారు.

## భగీరథ తాగునీటితో కష్టాలు తీరాయ్

### హర్షం వ్యక్తం చేస్తున్న మున్యాతండా వాసులు

మరిపెడ, అక్టోబర్ 12 : సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక మా తండాలో మంచినీళ్ల గోస తీరిందని నీలికుర్తి శివారు మున్యాతండాకు చెందిన గిరిజన మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తండాల్లో వేసవితో పాటు ఇతర కాలాల్లోనూ తాగునీటి కోసం మైళ్ల కొద్ది దూరం నడవాల్సి వచ్చేదని తండాకు చెందిన వీరమ్మ, లక్ష్మి, సుమిత్ర తదితరులు తెలిపారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవతో ఇంటింటికీ నల్లా నీటి సరఫరాతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి తప్పిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి చేసిన నీళ్లు కావడంతో సీజనల్ వ్యాధులు సైతం దరిచేరడం లేదని చెప్పారు.



మిషన్ భగీరథ నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

# వడివడిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

- రూ.24 కోట్లతో నిర్మాణం
- వరంగల్ లక్ష్మీపురం వద్ద 14 ఎకరాల విస్తీర్ణంలో..
- వెజ్‌కు 105, నాన్ వెజ్‌కు 60, పండ్లకు 85 షాపులు
- వివిధ దశల్లో నిర్మాణ పనులు
- మరో నాలుగు నెలల్లో పూర్తికి ప్లాన్



వరంగల్ లక్ష్మీపురం వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్

వరంగల్, అక్టోబర్ 12(నమస్తేతెలంగాణ) : అనేక అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ ప్రభుత్వం పల్లెలు, పట్టణాల రూపురేఖలను మార్చేస్తున్నది. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, వైకుంఠధామం నిర్మించింది. ఇదే సమయంలో ప్రతి పట్టణం, నగరంలోనూ వార్డు, డివిజన్‌కో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. వైకుంఠధామాలు నిర్మిస్తున్నది. ప్రధానంగా ప్రజలకు కూరగాయలతో పాటు మాంసం, చేపల వంటివి ఒకేచోట లభించేలా ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణం చేపట్టింది. వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల పరిధిలో ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని లక్ష్మీపురం వద్ద రూ.24 కోట్లతో మార్కెట్ నిర్మాణం చేపట్టింది. గతంలో వ్యవసాయ మార్కెట్ పనిచేసిన స్థలంలో ఈ దీని నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని పద్నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి జీడబ్ల్యూఎంసీ ఇంజినీర్లు డిజైన్ చేశారు. వెజ్ మార్కెట్ నిర్వహణకు 105, నాన్ వెజ్ కోసం 60 గదులు, పండ్ల మార్కెట్‌కు 85 గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయగా ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఆ వెంటనే ఇంజినీరింగ్ విభాగం టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. ప్రతిపాదిత స్థలంలో మార్కెట్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

### స్లాబు దశలో పనులు..

ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఐదు నెలల క్రితం ఈ పనులు మొదలైనట్లు జీడబ్ల్యూఎంసీ ఇంజినీర్లు వెల్లడించారు. వెజ్, నాన్ వెజ్, పండ్ల మార్కెట్ నిర్వహణ కోసం ఇక్కడ వేర్వేరుగా చేపట్టిన భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. కొన్ని భవనాల స్లాబు పనులు జరుగగా, మరికొన్ని భవనాల నిర్మాణం రూఫ్ లెవల్, ఫిల్లర్ల స్థాయిలో ఉంది. భవిష్యత్‌లో విస్తరణకు అనుగుణంగా పద్నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒకవైపున గ్రౌండ్ ఫ్లోర్‌తో ఉండేవిధంగా ప్రభుత్వం ఈ నిర్మాణ పనులను చేపట్టింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీకి పనులు చేయడానికి ఏడాది గడువు ఇచ్చింది. మరో నాలుగు నెలల్లోగా పనులు పూర్తవు తాయని జీడబ్ల్యూఎంసీ ఇంజినీర్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కొద్దిరోజుల క్రితం మార్కెట్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీర్లతో సమీక్షించారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయాలని చెప్పారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఏర్పాటు
- తూర్పులో 51 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

వరంగల్, అక్టోబర్ 12 : శాసనసభ ఎన్నికలు ప్రశాంతం, సజావుగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా పటిష్టంగా ఎన్నికల ప్రక్రియకు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. తూర్పు నియోజకవర్గంలోని 230 పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగానే గుర్తించారు. పోలింగ్ రోజు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పటికే గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. గోడలపై రాజకీయ పార్టీల పెయింటింగ్‌లను చెరిపేస్తున్నారు.

### 51 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు

తూర్పు నియోజకవర్గంలో 51 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. 26 పోలింగ్ కేంద్రాల పరిధిలో 51 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలింగ్ రోజు ఈ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్ల బృందాలు ప్రత్యేక నిఘా పెట్టనున్నాయి. సీఆర్పీఎఫ్ బలగాలను ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నారు.

### ప్రత్యేక బృందాలు..

ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు స్టాటస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, రెండు వీడియో సర్వేలెన్స్ బృందాలను నియమించారు. ఎన్నికల ఖర్చులను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటస్టికల్ సర్వేలెన్స్ బృందాలు మూడు షిఫ్ట్‌లో పనిచేస్తుంటాయి. 27/7 ఈ బృందాలు వాహనాల తనిఖీలు చేస్తారు. స్టాటస్టికల్ సర్వేలెన్స్ బృందాలు నియోజకవర్గం పరిధిలోని మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు.

## నిషేధిత వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవు

నెల్లికుదురు, అక్టోబర్ 12 : గుడుంబాను తయారు చేసి విక్రయించడం, అక్రమంగా ఇసుక రవాణా చేయడం వంటి నిషేధిత వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజు అన్నారు. గుడుంబా విక్రయిస్తున్న మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బానోత్ బుజ్జి, కాస్య తండాకు చెందిన హట్యానాయక్ ఎక్సైజ్ కానిస్టేబుల్ గౌస్ గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి గుడుంబా తయారు చేస్తే రూ. లక్ష జరిమానా విధించాలని, లేనిపక్షంలో జైలుకు పంపించాలని సమ్మతి పత్రాన్ని వారి నుంచి తహసీల్దార్ తీసుకున్నారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

కేసముద్రం : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని అన్నారం గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం డీఈవో తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల ఎఫ్ఏ1,2, ఎస్ఏ1 పరీక్షల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం, రాగి జావ నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని సూచించారు. అల్పాహార పథకం నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎంలు కొత్త జగన్మోహన్‌రెడ్డి, శ్రీధర్, సదయ్య, పూర్ణచందర్, విమలాదేవి తదితరులు ఉన్నారు.

## చేప పిల్లల పంపిణీ

దంతాలపల్లి, అక్టోబర్ 12 : రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఉచితంగా అందిస్తున్న చేప పిల్లలను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని దాట్ల, నిధానపురం, గున్నెపల్లి, పెద్దముప్పారం, ఆగపేట, బొడ్లాడ, దంతాలపల్లి గ్రామాల్లోని చెరువుల్లో 9లక్షల 20 వేల చేప పిల్లలను వదిలారు. ప్రభుత్వం ఉచితంగా అందించే చేప పిల్లలను సంరక్షించుకొని మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.



గున్నెపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న ముదిరాజ్‌లు